# పునాది

కరకర పొద్దుపొడిచేసరికి వూరిగమిల్లో కలకలమైంది.

కుక్క 'గొ...గొ' మని అరుస్తోన్న శబ్దమూ, వెనుకే గొంతు చించుకొనే చప్పుడూ, పసిగట్టిన వూరకుక్కలు ఒక్కసారిగా మొరుగుతూ బాణాల్లా ఎదురెక్కి వెళ్ళే దృశ్యం - వీధుల్లో నిల్చుని నోట్లో పుల్లాడిస్తోన్న జనానికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

వాళ్ళు అబ్బురాన్నించి తేరుకోకముందే ఎదురెళ్ళిన కుక్కలు పిల్ల మొగ్గలేస్తూ వీధి మలుపులో కొచ్చిపడ్డాయి. చావుకేకల్తో వెనక్కి వెనక్కి తిరిగి చూస్తూ జనాల వద్దకు పరువెత్తాయి.

వాటి చర్య రాబోయే ఏదో ప్రమాదాన్ని సూచిస్తోంది గాని అది ఏమిటయిందీ ఎవరి వూహకూ తట్టలేదు.

అనుభవజ్ఞుడైన బాలయ్య తాత కూడా అవగాహన చేసికోలేకపోతున్నాడు.

"పందులు... పందుల్రోయ్!" అంటూ ఎవరో కేకేయటంతో లేచి నిల్చుని అటుకేసి చూశాడు ఆయన.

వీధి మలుపులోంచి గుండ్రాల్లు దొర్లించినట్లు గునగున వూర్లో కొస్తున్నాయి ఐదారు పందులు. వెనక కొంత దూరాన్నించి వాటిని అదిలించుకొచ్చిన మనిషి విసరే కనికెడు పలుగురాళ్ళు వచ్చి పందుల మీదుగా తెట్టుగోడలకు తగిలి పగులుతున్నాయి.

"అడ్డం తిరుక్కోండ్రోయ్, పోనీగాకండ్రి..." పందుల వెనకనుంచి కేక ఎగసింది.

అప్పటికే జనం వీధుల్లోంచి చెల్లాచెదరయ్యారు.

అటుఇటు వెంపర్లాడి చేతికందిన బండిగుజ్జునో, పైపరంబడితెనో అందుకొని పోలికేకలేస్తూ వాటికేసి దూకేందుకు సిద్ధమయ్యారు.

చేతికర్ర అందుకొని వీధిలోంచి పక్కకు సర్దుకొంటూ "జాగర్తరోయ్ నాయనా! జాగర్త" అంటూ హెచ్చరించాడు బాలయ్య తాత.

ప్రతి మనిషికి ఏదో తెలీని పదరు గుండెల్లో మొదలైంది.

ఆడాళ్ళు భయం భయంగా ఆమూలకు యీ మూలకు తిరిగి మగాళ్ళకు కర్రలందిస్తున్నారు.

ముసలాళ్ళు వెనక్కి వెనక్కి జరిగి ఇంటిగోడల ఆపుకు సర్దుకొంటున్నారు.

చేత కర్రలున్నా పందులకు ఎదురెళ్ళేందుకు ఎవరికీ సాహసం చాల్లేదు.

బొద్దువారు నేలకు జీరాడేటట్లుగా బలిసివుంది ముందొచ్చేపంది. నేరుగా మనుషుల మీదకే దారితీస్తున్నట్లుగా వుంది అది.

పందులు వూర్లోకి రావటం అందరికీ విడ్డూరంగా ఉంది.

చేలల్లో కందిచాళ్ళ చాటున్నించో, ఆముదపు మొక్కల మాటున్నించో వచ్చి వేరుశెనగ పైరును కుళ్ళగించే జీవాలు, వీధులెంట బానలు దొర్లించినట్లుగా పరువెత్తుతొంటే ఆశ్చర్యంగా ఉంది.

"బెయ్యంగ్రా యీటెమ్మ..." అంటూ కర్రలు పైకెత్తి వాటికి ఇరుపక్కల్నించీ, వెనకనించీ కమ్ముకొన్నారు జనం.

వాళ్ళ అండతో కుక్కలు అంతులేని సాహసాన్ని ప్రదర్శిస్తూ పందుల వెనకభాగాల మీద దాడిజేశాయి.

కుక్కల్ని ఆపుజేసికొని వెనకపాటుగా పందుల మీదుగా కొన్ని బడితెలు దుబాగుబా పడ్డాయి.

కాళ్ళకు, కర్రలకు అడ్డుపడుతోన్న కుక్కల మీద రెండు దెబ్బలు పడటంతో "కుయ్యో" మంటూ వెల్లకిలాపడి కుంటుకొంటూ అక్కణ్ణించి జారుకొన్నాయి అవి.

ఆ దెబ్బల్ని పందులు పెద్దగా లెక్క జేయలేదుగాని, వాటి దిశ మార్చుకొని రోటికాడోళ్ళ సందుమీదుగా కోటవీధికేసి సాగాయి.

వాటికెదురుగా సందులో ఉన్నవాళ్ళంతా ప్రాణభయంతో మంచాలో, అరుగులో ఎక్కసాగారు.

వెనకజనం జాగ్రత్తగా వాటిని వెంబడిస్తున్నారు.

దేవాలయం వద్ద కెళ్ళేసరికి నాలుగు వీధుల యువకులు ఒడుపుగా వచ్చి అడ్డుపడటంతో పందులు చెల్లాచెదరైనాయి.

దెబ్బల్ని తప్పించుకొనేందుకు తలొక సందుకు పరుగుదీశాయి.

జనాల్లో భయం తగ్గి అప్పుడు మొదలైంది హుషారు.

ఈలలు కేకలతో ఒక్కోపంది వెనక ఒక్కో గుంపు పడ్డారు. అందిన చోటల్లా బడితెలతో వాటిని మోదసాగారు.

వందకేజీలు పైగా వుండే పెద్దపంది పంగోళ్ళవీధికి పరుగెత్తింది. తన వెంటబడ్డ జనాన్ని ముప్పుతిప్పులు పెడతోంది.

మంచాల కింద దూరి యీడ్చుకొంటూ వెళ్ళి వెల్లకిలా పడేస్తోంది.

పందిరి కూసాలు వొరిగేలా తగుల్తోంది.

ఇళ్ళల్లోకి దూరబోయి, ఆడాళ్ళు భయంతో వాకిళ్లేసుకోవటంతో, గాళ్ళల్లో దూరి ఎద్దుల్ని చిర్రెత్తింపజేస్తోంది.

వడగళ్లలా మీదబడుతోన్న కర్రదెబ్బల్ని లెక్కజేయకుండా అందిన వూరకుక్కల్ని ముట్టెతో విసరికొడుతోంది.

హుషారైన యువకులు పట్టువిడువకుండా పట్టెడు లావు చేవ బడితెలతో దానిమీద దాడిజేశారు. దాని బారి నుంచి తప్పించుకొంటూ అందినచోటల్లా అలుపెరగకుండా మోదారు.

కొంతసేపటికి అంతలావు పందీ మెత్తబడింది.

మొండిగోడ ఆపుగా జనాలకు మోటేసింది.

ఈసారి కర్రలకు బదులు గుండ్రాళ్ళు దాని వొంటిమీద దాడిజేశాయి.

బాధకు తట్టుకోలేక హృదయవిదారకంగా అరవసాగింది అది.

దాని అరుపు ఊరంతా ప్రతిధ్వనిస్తోంది.

అయినా ఎవరికీ పాపమనిపించలేదు. దానిమీద జాలి కలుగలేదు. దేవాలయం వద్దకు చేరుకొన్న బాలయ్య తాత ఆ పంది పడే యాతన గమనించాడు.

"కొట్టండ్రా! సంపండ్రా!" అంటూ హుషారిస్తోన్న ముసలీ ముతకను చూశాడు.

వాళ్ళతోటే దేవాలయపు పూజారి సైతం గొంతుకలపటం చూసి ఆశ్చర్యపడ్డాడు.

జీవహింసకు ఆమడ దూరముండే బాపనయ్య హృదయాన్ని సైతం తమ అరాచకత్వంతో పందులు విరిచేశాయంటే ఇక ఆపి ఏ మాత్రం క్షమించరానివనే నిర్ణయానికొచ్చాడు అతను.

పూజారి హుషారు రైతులక్కూడా ఒళ్ళు గగుర్పొడిచేలా చేసింది.

వాటి మీద కసి రెట్టింపయ్యింది.

ముసలాళ్ళ దగ్గర్నించి పిల్లల దాకా వాటిమీద పీకల్దాకా కోపముంది.

ఆడాళ్ళకయితే యిక చెప్పాల్సిన అవసరమే లేదు.

పునర్వసు కార్తె మొదలు తమ మగాళ్ళ నెవర్నీ ఇంటికాడ ఉంచనీయట్లేదు యీ పందులు.

మందలు మందలుగా వచ్చి రాత్రిళ్ళు చేలల్లోపడి పైరంతా నాశనం చేస్తోన్న వీటికి కావలి పండుకోవటంతోటే సగం జీవితం గడిచిపోతోంది.

సద్దపైరు నించి మొదలవుతుంది కాపలా తతంగం.

వేరుశెనగ విత్తనాలు మొలకెత్తే వారం రోజులూ

ఊడలు దిగి పైరు పీకే నెలరోజులూ

వరినారు ఎదిగే నెలరోజులూ,

పొద్దుతిరుగుడు పూల పక్వపు పక్షం రోజులూ.

జొన్నచేల దినాలూ,

పండిన వరి చలినాళ్ళూ.

ఒకటేమిటి, ప్రతిపైరూ మొలకనించి కళ్లాలదాకా కావలుండాల్సిందే.

ఎంత జాగ్రత్తగా కనిపెట్టుకొని ఉన్నా, మనిషిని ఏమార్చి ఏదొక మూల పైరు నాశనం చేస్తున్నాయి.

కొత్త దంపతులకు సైతం పందులవల్ల ఎడబాటు కలుగుతోంది.

హుషారైన కొందరు యువకులు పెళ్ళాలను వెంటేసుకొనే కాపలాకు వెల్తున్నారు.

రైతుల్ని యిన్ని వెతలకు గురిజేస్తున్న పందుల మీద వాళ్ళకు అంతులేని కసి వుండటంలో ఆశ్చర్యం లేదు.

రైతులందరి బాధల్ని ప్రతిపూట గమనిస్తోన్న పూజారికి కూడా వాటిమీద కోపం రావటం వింతకాదు.

కోట వీధి నుంచి పందిరోదన మొదలైంది.

జనం చేతుల్లో చిక్కినట్లుంది అది.

పంగోళ్ళు పందిని పూర్తిగా నేలబడగొట్టారు.

అదింకా అరవటం చాలించలేదు.

జనం దాన్ని కొట్టటం మానలేదు.

దానిముట్టె సొంతం రక్తమయమై ఉంది. తల నేలకు వాల్చి నెత్తుటి బుడగల మధ్య ఎగశ్వాస దిగశ్వాసగా ఉంది.

ఆ సమయంలోనే ఇంటిపంచదిగి వీధిలోకి వచ్చాడు ఆ వూరి ప్రెసిడెంట్ రామిరెడ్డి.

సంతోషభరితంగా సాగే అక్కడి దృశ్యాన్ని సిగరెట్టు వెలిగించుకొంటూ పొగలమధ్య నించి ఓరగా చూశాడు. అగ్గిపుల్ల నేలకేసి విసుర్తూ దేవాలయం వద్దకు నడిచాడు.

"ఏ పక్కనుంచి వచ్చినయిరా పందులు?" అడిగాడు అక్కడున్న పిచ్చన్నను.

"జెర్రిపోతుల సేలమీదుగా వచ్చినయంట పెదనాయనా!" చెప్పాడు.

ప్రెసిడెంటు కళ్ళలో ఆదుర్దా కన్పించింది.

వాళ్ళచేలు కూడా అక్కడే వుండేది.

జీరాడే పంచను ఎగజెక్కి చకచక వీధెంట కదిలాడు ఆయన. తూర్పు వీధినబడి వేగంగా అడుగులేస్తూ వూరు దాటాడు.

అతని ప్రవర్తన బాలయ్య తాతకు అరిగిరాలేదు.

రైతుల అంతులేని యీ సంతోషాన్ని పట్టించుకోనట్లే వెల్తున్నాడు. వాళ్ళ ఆనందం తనకిష్టం లేనట్లుగా ప్రవర్తిస్తున్నాడు.

తనేదో ఆకాశంలోంచి అప్పుడే వూడిపడ్డట్టుగా అక్కణ్ణించి జారుకొంటున్నాడు.

"యాందిరే! యీడు ఎగాదిగానన్నా సూడగుండా పోతాండు" పక్క మనిషితో అన్నాడు.

"ఆయనకేం మామా – మారాజు. సూసినా సూడకున్నే ఆయన భాగం సియ్యాలు ఆయనింటికి నడ్సిపోతాన్లే!" చెప్పాడు అతను.

'అవు' నన్నట్లు సాలోచనగా తలపంకించాడు బాలయ్య తాత.

రైతుల ఉత్సాహభరితమైన పందివేట ఏ ఆటంకం లేకుండా సాగింది.

గుంపులు గుంపులుగా వెంబడించి నాలుగుపందుల్ని నేలబడగొట్టారు వాళ్ళు.

ఒకటి డొంకలో పడిపోయింది.

మరొకదాన్ని వెంబడిస్తే దిక్కు తెలియక అరుస్తూ బ్రాహ్మలింట్లో జొరబడింది. దాన్ని అక్కడే నేలబడగొట్టి చంపబోతోంటే, బాపనమ్మగారిలో చలనమొచ్చినట్లుంది. "ఒరే బ్రష్టు వెధవల్లారా! దాన్ని సంపగాకండ్రా!" అంటూ దూరాన్నించే చేతులు అడ్డుంచింది. అంతలో బాపనయ్య కూడా వచ్చి వాళ్ళకు అడ్డుపడ్డాడు. దాని బాధను చూళ్ళేక అందర్నీ మందలించి వెనక్కి పంపి, నేలబడ్డ దాని మొహాన చెంబెడు నీళ్ళు చిలుకరించాడు. దాంతో తెప్పరిల్లిన పంది సొక్కుతూ, సోలుతూ మొండిగోడలంట కంప చెట్లెంట మెల్లిగా గమిలిదాటింది.

రెండు పందులు మాత్రం ఒడుపుగా కదిలాయి. నాలుగు దెబ్బలు వొంటిమీద పడగానే పిక్కబలం చూపించాయి. ఎవరికీ చిక్కకుండా జ్యోతి వాగులోపడి జమ్ము మందలో దూరి వాగెంట పాపిరెడ్డిపల్లెకేసి పరువెత్తాయి.

డొంకలోపడ్డ పంది పూర్తిగా చచ్చినట్లుంది.

పంగావాళ్ళవీధి పంది, కోటవీధి పంది కొనప్రాణాల్తో రోజుతున్నాయి.

సంతోషంగా సాగిన పందివేట ముగిసింది.

పడిపోయిన పందులన్నిట్నీ చుట్టివస్తున్నారు పిల్లలు. రాళ్ళతో కొట్టి, పుల్లల్తోచెక్కి వాటి కదలికల్ని పరిశీలిస్తున్నారు.

అయ్యవారింటికాడ దెబ్బతిన్న పందికూడ పాతకళ్ళాల వద్ద కంపచెట్లలో దూరి-పడి పోయిందనే వార్త రైతుల చెవులకు మహోయింపితంగా చేరింది.

వాటిని ఒకచోట చేర్చి కోసి, భాగాలేసి, కూరొండుకు తింటేగాని తమకసి తీరదనుకొన్నారు అందరూ.

పందిసియ్యల్ని తల్చుకోగానే బోసినోటి బాలయ్య తాతక్కూడా నోట్లో నీళ్ళూరసాగాయి. వేలెడు మందాన కొవ్వుబట్టిన బొద్దు వార్లను నోటబెట్టుకోగానే చివుర్ల కిందసైతం వెన్నలా కరిగిపోయి మరే మాంసం వల్లా దొరకని మధురమైన రుచిని నాలుక అందుకోవటం వూహిస్తున్నాడు.

చాలామందిలాగే పందిసియ్యల మీద బాలయ్య తాతకు యావ జాస్తి. అన్ని కూరలకంటే మంచిది 'అదే' నంటాడు. ఒంట్లోవేడిని తగ్గించే గుణం దానికుందంటాడు.

అందుకే వీసెలు వీసెలు తీసికెళ్ళి మాడ్చి, ఉట్టిమీద పెట్టుకొని తనివిదీరా తినేవాడు వయస్సులో. కోసేటపుడే బొద్దువార్ల ముక్కల్ని పచ్చికొబ్బరిలా కొరుక్కుతినేవాడు.

"ఏ మొర్రే! అయి పొయ్యిందా మీ వేట?" తలెత్తి చూశాడు బాలయ్యతాత.

చేలకాన్నించి తిరిగొచ్చినట్టున్నాడు ప్రెసిడెంటు. దేవళం వద్దనున్న వాళ్ళను అడుగుతున్నాడు.

"నాలుగుటెను పడగొట్టినం మామా!" హుషారుగా చెప్పాడు ఒకతను.

"మీకు బుద్ధుందంటారా?" అందరికేసి చూస్తూ అన్నాడు ప్రెసిడెంట్.

"ఏమయ్యా?"

"మీరు సంపినవన్నీ అడవిపందులేనా?"

అయోమయంగా అతనికేసి చూశారు అక్కడున్న వాళ్ళంతా.

"అడవిపందులైతే మాసులకు మచ్చికైనట్లు వూర్లో కొస్తయా? మీ సేతుల్లో సస్తయా?... ఇయ్యేవురియో వూరబందులే. వాల్లోస్తే ఏం సెబుతరో ఆలోసించుకోండి"... అంటూ మరోమాటకు అవకాశమివ్వకుండా బిరబిర నడచి వెళ్ళాడు.

వెల్తోన్న ప్రెసిడెంటుకేసి నొసలు మూడేసి చూశాడు బాలయ్య తాత.

హఠాత్తుగా అందరి గుండెల్లో బాంబు పగలేసిపోతున్నాడు.

రైతుల్లో అనుమానం వేరుపురుగై దొందుకొంది.

ఆలోచిస్తే ప్రెసిడెంటు మాటల్లో కూడా నిజమున్నట్లుగా తోస్తోంది.

ఊర్లోకొచ్చిన పందుల ప్రవర్తనను నిశితంగా సమీక్షిస్తే - అవి అడవి పందులన్న నిజానికి గండిపడుతోంది.

ఆ ఆవేశం అట్లాంటిది.

అవి తమకు చేసే చెడును ప్రాతిపదికగా వాటి జాతి మొత్తాన్ని ఒకేగాట కట్టేయటం వల్ల జరిగిన పొరబాటు ఇది.

అవును..... తాము పొరబాటు చేసినట్లే వుంది.

అవి అడవి పందుల్లా లేదు.

అడవి పందులు ఊర్లోకి రావనే సత్యాన్ని వదిలేసినా, మనుషులు చుట్టూ తిరుక్కొన్నపుడు తప్పించుకొనే దారి వెతక్కోటానికి బదులు మూర్ఖంగా మనిషి మీదకు దాడిచేయటం వాటినైజగుణం.

ఇంతమంది చుట్టూ కమ్ముకొని యుద్ధంజేసినా ఒకర్ని కూడా గాయపరచలేదంటే అవి ఖచ్చితంగా వూరబందులే.

రైతుల ఎదల్లో అలజడి మొదలైంది.

ఈ కష్టాన్నించి ఎలా గట్టెక్కాలో తోచకుండా ఉంది.

ఏవైపు నించో కనిపించని ఆపద – కమ్ముకొస్తోన్నట్లుగా ఉంది.

పంది దట్టేల్ని ఒకచోట చేర్చే బదులు, ఒకొక్కరే వీధుల్లోంచి మెల్లిగా జారుకొంటున్నారు.

అంతలో వాళ్లూహించిన ఆపదరానే వచ్చింది.

తూర్పు వీధిలో కార్చిచ్చులా వచ్చిపడింది.

నలుగురు ఎరుకలు కేకలేసికొంటూ వచ్చారు.

పెద్ద పెద్ద అంగలేసికొంటూ ముందు నడుస్తోన్న మనిషికి యాభై ఏళ్ళుంటాయి. నల్లటి పటిష్టమైన శరీరంతో పోతపోసిన ఉక్కు విగ్రహంలా ఉన్నాడు. మీసాలు మెలేసుకొంటూ, బాణాకర్రను వూపుకొంటూ నడివూర్లోకి ప్రవేశిస్తున్నాడు.

అతని భార్యలు కాబోలు వెనుక ఇద్దరు చింపిరి తలల ఆడాళ్ళు చేతులెత్తి వీధులకి శాపాలు పెడుతూ అతన్ని అనుసరిస్తున్నారు.

వాళ్ళ వెనగ్గా అతని కొడుకు కాబోలు పదిహేనేళ్ళ యువకుడు దిక్కులు చూస్తూ నడుస్తున్నాడు.

"అడవి పందులకూ, వూరబందులకూ వారా దెలని నంగనాసులా మీరు!" అంటూ కేకలేస్తున్నాడు ఎరుకల పెద్ద.

విచారించి పడిపోయిన పందులన్నిట్నీ పరామర్శించటం మొదలెట్టారు.

చచ్చిన పందుల్ని చూడగానే గుండెలు అదిరిపోయేలా శోకాలు తీయసాగారు ఆడాళ్ళు.

పంగోళ్ళ వీధి పందిని చూస్తూనే ఎరుకల పెద్ద సైతం కన్నీళ్ళ పర్యంతమయ్యాడు. ఊరిజనాన్ని నిందిస్తూనే చెంబుతో నీళ్ళిప్పించుకొని, దాని మొహాన చిలుకరించాడు. ముక్కు కపండాల ద్వారా గుర్ఘురిస్తూ దానితో సంభాషించాడు.

రెప్పలు మూసికొని రోజుతూ ఉన్న పంది ఆశ్చర్యంగా కళ్ళు తెరిచి చూపరులంతా దిగ్భ్రాంతులయ్యేలా మెల్లిగా లేచి తాగిన దానిలా వూగుతూ వీధెంట కదలసాగింది.

అన్ని దెబ్బలు తిని కూడా లేచి నడుస్తోన్న ఆ జీవం పందో? పిశాచమో? అర్థం కాలేదు జనానికి. తాము చూస్తున్నది కలో, నిజమో తేల్చుకోలేని భ్రమలోపడ్డారు వాళ్ళు.

దాని ప్రమాదకరమైన పోకడ చూసి ఆందోళనపడుతూ, ఆగమని పిలుస్తూ వెంటబడ్డాడు ఎరుకల పెద్ద.

యజమాని పిలుపు గ్రహించే స్థితిలో లేదు పంది.

సోలుతూ వెళ్ళి వూరిబైటి పడమటి బావిలో గుభిల్లున దూకింది. ఎరుకలతని గగ్గోలు వెనక బుడబుడ బుడగలతో దాని చరిత్ర నీటి అడుగున ముగిసింది.

కొంతసేపటికి నలుగురు ఎరుకలూ దేవాలయం ముందుకొచ్చారు.

వాళ్ళ కళ్ళల్లో పందులు పోయాయనే అంతులేని ఆవేదన వెనక రైతులపట్ల క్రోధం కూడా అలముకొని ఉంది.

ఒకావిడ కొడుకును వెంటేసుకొని తప్పిపోయిన పందులకోసం వూరుదాటింది.

మరొకామె అక్కడే రాగాలు దీస్తోంది.

ఎరుకల పెద్ద మాత్రం గొంతెత్తి ఎదురుగా ఉన్న వాళ్ళను బిగ్గరగా ప్రశ్నిస్తున్నాడు.

ఇళ్ళల్లోంచి తొంగిచూసే వాళ్ళమీదుగా వీధుల్ని సంజాయిషి అడుగుతున్నాడు.

తనంత కడుపు చించుకొంటోన్నా 'మే' మంటూ ముందుకురాని పెద్ద చెవుల్ని తాకేలా వూరంతట్నీ నిలదీస్తున్నాడు.

రైతులు ధర్మ ప్రభువులను కొన్నానేగాని యిట్లాంటి వాళ్ళని కల్లోకూడా అనుకోలేదన్నాడు.

తన కడుపుకొట్టి ఎవరూ బాగుపడరన్నాడు.

ఎంతకూ పలకని వూరిమీద చివరకు ఎగిరిపడ్డాడు.

ఇన్నేళ్ళూ ప్రాణంలా సాక్కొన్న పందుల్ని రైతులంతా కోసక తినేందుకే అన్యాయంగా చంపారనీ అందరిమీదా పోలీసుకేసు పెట్టకుండా చాలించేది లేదనీ ప్రకటించాడు.

రైతులు గుండెలు అవిసిపోయాయి.

బాలయ్యతాత అక్కడే వుండి వింటున్నాడు. వాళ్ళ బాధని గమనిస్తున్నాడు. ఎవరయినా వచ్చి సంజాయిషి ఇస్తారని చూస్తున్నాడు.

ఎరుకలతని ప్రవర్తన ఆయనకంతగా నచ్చలేదు. రావటమే యుద్ధానికి వచ్చినట్లుందిగాని సమస్యను పరిష్కరించుకొందామని ప్రయత్నిస్తున్నట్టు లేదు.

కృష్ణ రాయబారంలా 'ఇస్తావా? చస్తావా?' అన్నట్లుంది.

సాధారణంగా ఏ ఎరుకలూ ఇతనిలా ప్రవర్తించరు.

అలాగని, ఏ రైతులు కూడా ఇట్లా పట్టనట్టుగా జారుకోరు.

ఈ విచిత్ర ప్రవృత్తుల వెనక కారణమేమిటో వూహించేందుకు ప్రయత్నించసాగాడు ఆయన.

తాము చేసింది సవరించుకోలేని బలమైన తప్పుగా రైతులకు అర్థంకావటమే వారి యీ ప్రవర్తనకు కారణమంటే సబబుగా అన్పించలేదు.

వాళ్ళు భయపడుతున్నారు.

తాము చేసిన తప్పుకు ఎరుకలు తీసికొనే చర్యపట్ల భయపడుతున్నారు.

ఆ విషయాన్ని ముందుగానే హెచ్చరించి తానేమీ సహాయం చేయనన్నట్లుగా సూచించి వెళ్ళిన ప్రెసిడెంటు ప్రవర్తన పట్ల భయపడుతున్నారు.

అవును....

మంచికి చెడ్డకు కొండంత అండగా ఉన్న ప్రసిడెంటు, వరిక్కంపలో ఇరుక్కుపోయిన తమల్ని చూసి పట్టించుకోకుండా వెళ్ళటంపట్లే భయపడుతున్నారు.

ముందు గ్రామస్థుల భయం పోగొట్టాలి.

కేసుల విషయం తెలీని వాళ్లు, ఊర్లోకి పోలీసులు రావటం ఎరగని వాళ్ళు, గలభాలంటే ఆమడదూరం పరువెత్తే వాళ్ళు, తెలిసో తెలియకో తాముచేసిన తప్పుపట్ల భీతిజెందుతోన్నవాళ్ళు.... ముందు వాళ్ళ భుజాల్ని తట్టాలి.

అందుకు ప్రెసిడెంటును ఆశ్రయించక తప్పదు.

దేవాలయం వద్దనించి కదిలాడు బాలయ్య తాత.

వాళ్ళను వీళ్ళను కలిశాడు.

పదిమందిని పోగేసుకొని ప్రెసిడెంటు ఇంటికేసి నడిచాడు.

తారాస్థాయికి చేరుకొన్న ఎరుకల పెద్ద బెదిరింపుల గొంతు వాళ్ళ మనసుల్లో అతనిపట్ల జాలిని తుడిచేస్తూ మరేదో భావాన్ని సృజిస్తోంది.

వాళ్ళు వెళ్ళేసరికి కొడుకుతో ఏదో ముచ్చటిస్తూ పెద్దగా నవ్వుతున్నాడు ప్రెసిడెంటు.

అందరూ లోనికెళ్ళి ఎవరికి తగిన స్థానాల్లో వాళ్ళు సర్దుకోగానే చిరునవ్వుతో "ముసలిమామ మాయింటికి రాక శానా రోజులైంది" అన్నాడు బాలయ్య తాతను ఉద్దేశించి.

"యాడ వుసిందెబ్బీ! గొర్రెపిల్లనో, దూడపిల్లనో కాసకరావాల్సొచ్చె. దానికి తోడు కంటిసూపు గూడా ఆడికాడి కొచ్చె" చెప్పాడు.

"ఆవ్‌లే. రావాలన్నే మా కొంప రొవ్వంత దూరముందా? సూపు కానదు. నడక కందదు" బిగ్గరగా నవ్వాడు ప్రెసిడెంట్.

అతనితో బాటు కొన్ని గొంతులు శృతి గలిసాయి గాని, అందులోని వ్యంగ్యం ఎందుకో తన్ను చురక్కుమనిపించి బాలయ్య తాత పెదవి విప్పలేదు.

నవ్వులాగింతర్వాత నాగయ్య అన్నాడు "అడవి పందులనుకొని ఎంత పొరబాటు పన్నెరోయ్ దొరా!– పిల్లోల్లంతా" అని.

"పొద్దున్నించి వూరంతా బో సందడిగా ఉంది. సంకురాత్రి క్కూడా లేదబ్బాయీ జోరు. నాలుగు పందులకు నాలగ్గంటల తిరనాళ్ళ. ఆ రెండు పందుల్నీ దొరికించుకోనుంటే యిప్పటిదాకా పొద్దుబోక పొయ్యిందా?" నవ్వుతూ అన్నాడు ప్రెసిడెంటు.

"యీడికే యాకటయ్యింటే యింగా పందులా?" అంకయ్య అందుకొన్నాడు.

"ఏమంత యిబ్బందొచ్చింది? నోటికి రుసిగా తినేంత దొరికిందనా?"

"వాల్లొచ్చి కూకున్నెరబ్బీ! కేసు బెడ్తామంటాండ్రు" ఆగలేక చెప్పాడు బాలయ్య తాత.

"ఎవరు? ఎరికెలోల్లా? ఆ ...వాల్ల మొగంలే..." తేలిగ్గా కొట్టిపారేశాడు.

"లేదు రామిరెడ్డీ! నిజంగానే" సుబ్బన్న చెప్పాడు.

"సాల్లే! వూరుకోండి. ఎరికెలోల్లు కేసుబెట్టడమేంది?" విసుక్కున్నట్లుగా అన్నాడు.

అతను నిజంగానే అంటున్నాడో, ఎకసక్కెంగా అంటున్నాడో ఒక పట్టాన అర్థం కాలేదు బాలయ్య తాతకు.

"నీకు సులకనగానే ఉంది. మాకు దిక్కుదెలడంలే. వచ్చి వాల్లతో మాట్లాడ్డూరాన్నా!" ఓబన్న కంఠంలో దైన్యం గోచరించింది.

జేబులోంచి సిగరెట్ పెట్టె తీసి సిగరెట్ నోట బెట్టుకొని అగ్గిపుల్లతో అంటించి దమ్ములాగుతూ అన్నాడు. "ఎరికెలోల్లకాడికి నేనల్లా రావాల్నా?... మనపిల్లోల్లు లేరూ?" అని.

"ఎవరూ?"

"ఇంగెవురు? నీ కొడుకు.... ఆయన కొడుకు.. యీ మామకొడుకు...యింగా..."

అప్పుడర్థమైంది అందరికీ ప్రెసిడెంట్ మనస్సులో ఉన్నదేమిటో.

గత పదేళ్ళుగా వూర్లో ఆయన మాటకు ఎదురులేకుండా జరిగింది. రాజకీయాల్ని జాగ్రత్తగా వాడుకొని కంట్రాక్టుల ద్వారా బాగా డబ్బు సంపాదించాడు. పెద్దరికాన్ని అడ్డేసి కుమారుని ద్వారా గ్రామంలో రైతులు పండించిన పంటను కొని మిల్లులకు తోలి ఆ మార్గంలో కూడా దండిగానే ఆర్జించాడు..

గ్రామస్తుల్ని కేవలం తను ఆర్థికంగా బలపడేందుకు ఉపయోగపడే శక్తులుగా మలచుకొన్నాడు.

సంవత్సరం కిందటి దాకా ఆయన దారికి అడ్డులేకుండా వుండేది.

ఇప్పుడు మాత్రం ఆయన్ను ఎదిరించి మరో నాయకుడు తలెత్తాడని కాదు.

గత ఏడాది నించి యువకుల్లో ఏదో మార్పొచ్చింది. ఆయనకు ఎదురు దిరగకున్నా ఆయన శాసనాల్ని అమలుపరచటం లేదు. ఆయనకు సేవచేసేందుకు ముందుకు రావటం లేదు. తమ పంటను సైతం మరొక వ్యాపారికి అమ్మటమో తామే మార్కెట్టుకు తోలటమో చేద్దామనే పరిస్థితికి వచ్చింది. తమ తండ్రులే తమ ప్రయత్నాలకు అడ్డురావటంతో మొన్నటి పంట ప్రెసిడెంటుకే అమ్మటం జరిగింది.

రాజకీయంగా కూడా అసంతృప్తిగా రగులుతున్నారు. రాబోయే ఎం.పి ఎలక్షన్లకు పరిస్థితి ఎటువస్తుందో అర్థం కాకుండా వుంది.

తన పట్టు జారిపోతున్నట్లుగా కూడా ప్రెసిడెంటుకు అన్పిస్తూ ఉంది. యువకులింకా స్వంత నిర్ణయాల్ని అమలుపరిచే దశలోకి రాలేదన్నది ఆయనకు తెలుసు.

అందువల్లే పెద్దలంతా కట్టగట్టుకు తనవద్దకొచ్చింది.

తనకిదే సరైన అదను.

“వాల్ల మొగం వాల్లేంజేస్చురులే రామన్నా! ఏదొకటి నువ్వే జెయ్యాలగాని” ఓబన్న చెప్పాడు.

తెగేదాకా లాగదల్చుకోలేదు ప్రెసిడెంట్. వాళ్ళకు తన అవసరం తెలిసివస్తే చాలు. రేపు ఎలక్షన్నల దృష్ట్యా తన పట్టు విడుపుల్ని ప్రదర్శించక తప్పదు. బంతి తన గుప్పిట్లోకి వస్తే చాలు.

తన ఉద్దేశ్యం వాళ్ళకు బాగా అర్థమైంది.

తను కోరుకొనేది కూడా అదే.

“ఎవునింటికి వాడు నాయకుడై, ఎవుని బుద్ధిబుట్టినట్లు వాడాలోసెనజేస్తే వూరు నాశనమైద్ది. పిల్లోల్లను మందలించండి. నేన్జెప్పినట్లు వొద్దులే. మీరు జెప్పినట్లయినా నడుసుకొనేట్లు సూసుకోండి” చెప్పాడు.

“వాల్లేడికి పోతార్ను. పిల్లసేట్టాలులే దొరా! మమ్ముల్ను కాదని పోతే మెట్టున గొట్టమూ” నాగయ్య చెప్పాడు.

ప్రెసిడెంటుకు తృప్తి కలిగినట్లయింది.

“మీరు నా పరువు నిలబెట్టండి. నేను వూరు పరువునిలబెడ్తా” అంటూ హుషారుగా లేచి పై కండువా సవరించుకొని “ఇంతకూ ఏమంటాంద్రు ఎరకెలోల్లు?” అడిగాడు.

“కేసు బెడ్దామంటాంద్రు.”

“ఎవురి మీంద? నానెమ్మ మొగున్ల మీందనా” అంటూ ఎదురుగా వున్న కొడుకు కేసి చూసి “రఘూ! వాల్లకతేందో రొవ్వొంత యిసారించి రాపో” చెప్పాడు.

రఘు పంచదిగి దేవాలయం కేసి నడిచాడు.

ఎరుకల పెద్ద ఇంకా బీరసాలు తీస్తున్నాడు.

అతని ధోరణి రైతులకు గొంతులో గుచ్చుకొన్న చేపముల్లుల్లా తోచింది.

ఒక్కడొచ్చి వూరందర్నీ హడలెత్తించటం వాళ్లకిప్పుడు సిగ్గుగా అన్పిస్తోంది.

అప్పటిదాకా వాళ్ళల్లో ఉన్న పిరికిదనం కాస్తా అతనిమీద కోపంగా మారింది.

ఎరుకల వద్దకెళ్ళి చెప్పాడు రఘు "మీరంతా ఏడవాల్సిన పన్లేదు. మిమ్మల్ని నష్టపెట్టే ఉద్దేశ్యం మాకులేదు. ఫలానా వూరి గుండా ఫలానా వాడు చెడిపోయాడనే చెడ్డపేరు మాకొద్దు. నీపందుల రేటు కట్టిస్తాం. ఇంక అరవగాకు" అని.

"కడుపాత్రం తట్టుకోలేక కేకలేస్తాందగాని, నా రూపాయలు నాకిస్తే నేనెందుకు కరుస్తా సోమీ!" అన్నాడు ఎరుక

"కడుపాత్రం నీకే కాదు. మా వాళ్ళకూ ఉంది. వీళ్ళు నీ కంటే సావుకార్లేంకాదు. వీళ్ళగుండా నువ్వెంత నష్టపోయ్యావో, నీకు కట్టించే ముందు, నీగుండా వీళ్ళెంత నష్టపొయ్యారో అదీ లెక్కదేలాలి."

"నా గుండానా?" బిత్తరపోయాడు ఎరుకలతను.

"నీ గుండానే...ఇదిగో... యీ సచ్చిన నీ పందులు గుండా"

"నా పందులా!"

"ఆ...నీ పందులే" రెట్టించి చెప్పాడు రఘు. ఏమీ తెలియని నంగనాచిలా సమాధానమిస్తోన్న ఎరుకల పెద్దమీద మండిపడ్డాడు.

"ఒకరికిద్దరు పెండ్లాల జేసికొని తెల్లార్లూ వాళ్ళ మధ్యన నువ్వు వెచ్చగా పండుకొని, పందుల్ని చేలమ్మటి విడ్చిపెడ్తే వాటెకు కావిలెవరుంటరు? మియ్యమ్మ మొగున్లా? సేలన్నీ నాశనం జేస్తిరి గదరా! మళ్ళీ ఏ మొగం పెట్టుకొని వూర్లోకొచ్చి అడుగుతాండ్రు? మావాల్లు మంచోల్లయి సరిపోయింది. లేకుంటే పందుల్తోబాటు మిమ్మల్నీ సావబాదాల్సింది.... మర్యాదగా వూరుదాటిపోండి" అంటూ ఉగ్రుడై లేచాడు.

దాంతో అక్కడి వాతావరణం మారిపోయింది. మరోనలుగురు యువకులు నోరుజేసికోవటంతో ఎరుకలు ఖిన్నులయ్యారు.

"ఇన్నాల్లూ సాక్కొన్న పైరంతా మీ బొక్కన కొట్టుకొంటిరి గదొరే!" అంటూ కొందరు రైతులు తిట్లకు మొదలెట్టారు.

ఎరుకలు పూర్తిగా డీలా పడ్డారు.

పరిస్థితి యిలా మారుతుందని వాళ్ళూహించినట్లు లేదు.

రైతులకు ఆనందంగా ఉంది.

గండం గడిచిపోవటంతో సంతోషం ఉరకలేసింది.

అందర్నీ పిల్చి చెప్పాడు ప్రెసిడెంటు "పందులన్నిట్నీ కోసి భాగాలేసుకోండి. ఆనందంగా తినండి" అని.

సంతోషంతో ఊళలేశారు కొందరు.

పదమటి బావిలో దూకిన పందిని బైటకు తీసేసరికి ప్రళయమైంది.

పందులన్నిట్నీ కోట వీధిన ఒకగొడ్ల కొట్టంలోకి జమచేశారు.

మొదట చిదుగుల్తో మంటజేసి పంది దట్టేల్ని మంట మీదకు పొర్లించారు. కొవ్వు కరిగి వారు మీద జిబజిబలాడేలా దోరదోరగా కాల్చారు. పై పొరంతా రాలిపోయేలా కత్తుల్తో ఒళ్ళంతా గోకారు.

తర్వాత చూరుకత్తుల్తో వాటిని కమ్ముకొన్నారు.

పందుల్ని కోసే కొట్టానికి బైట మొండిగోడల రాళ్ళమీద కూచుని గుడ్లనీళ్ళు విడుస్తున్నారు ఎరుకలు. వాళ్ళ ఆడాళ్ళు సన్నగా శోకాలు పెడుతున్నారు.

వాళ్ళను చూసి చాలా మందికి జాలిపుట్టలేదు. ఊరందర్నీ బెదిరించటమనేది వాళ్ళ పాలిట శాపమైంది.

తనూ ఓ బండమీద కూచుని, వాళ్ళకేసి చూస్తున్నాడు బాలయ్యతాత. ఊర్లో అందర్నీ హడలెత్తించిన ఆ గడుసుదనానికీ, యీ దైన్యానికీ ఎక్కడా పోలికలేదు. వాళ్ళ ప్రవర్తన యిప్పటికీ అర్థం కాకుండా ఉంది.

"యింగా యీడుండారెందుకు? పోండి పోండి" ఎరుకలకేసి చూస్తూ ఎక్కస పట్టలేక గద్దించాడు ఒకడు.

"పోతాం సోమీ!" దండం పెట్టాడు అతను.

"యీ దండాల్దసుకులు ముందేబెట్టి, కాల్లో, కడుపులో పట్టుకోనుంటే తృణమో, పణమో రాకపొయ్యిందే, కేసు బెద్తవుగా... అందర్నీ స్టేషన్లో బేయిస్తవుగా...ఏయించు... బెన్నేపోయి పోలీసోల్లను తీసకరాపో...పో..." రెట్టించాడు మరొకతను.

"నా కర్మ సోమీ!" వలవల ఏడ్చాడు ఎరుకలతను.

తర్వాత ఎవరి పనిలో వాళ్ళు నిమగ్నమైనారు.

ఎరుకలతను వేదనతో ఏదేదో గొణుక్కొంటున్నాడు.

"నేనెప్పుడూ రైతుల్తో సెడ్డగాలే...కొట్టినా వాల్లే పెట్టినా వాల్లేనని వాల్ల కాల్లకాడ పడుండేటోన్ని... యియ్యాల నా కర్మ...."

బాలయ్య తాతకు విన్పిస్తూ ఉంది అతని స్వగతం. ఆసక్తికరంగా కూడా ఉంది.

కోత కార్యక్రమం ముమ్మరంగా సాగుతూ ఉంది.

పొట్ట భాగాన్ని కడిగేందుకు దూరంగా తీసికెల్తున్నారు కొందరు.

ఎముకల్ని నరికేందుకు అడవి మొద్దు కోసం వెంపర్లాడుతున్నారు ఇంకొందరు.

పొట్టకసురు నీచువాసన, పచ్చిమాంసపు యాదర వాసన ఆ ప్రాంతమంతా వెగటుగా అలుముకొంది. వారు కాల్చిన కమ్మటి కమురు వాసన అప్పుడప్పుడూ బలహీనంగా వచ్చి ముక్కులకు సోకుతోంది.

ఎవరో వచ్చి అడిగారు "వారు కొరకుతవా అబ్బా?" అని.

"నాకు పండ్లులేవురా అబ్బీ!" చెప్పాడు బాలయ్య తాత.

ఒంగిన తలను రెండుచేతుల మధ్య ఇరికించుకొని కూచున్న ఎరుకల పెద్ద కళ్లు వర్షిస్తున్నాయి.

ఎరుకల దయనీయమైన ఏడుపు రైతుల మనసుల్లోని కఠినత్వం ఎనక ఎక్కడో దాగున్న తడిదాకా పాకుతోంది. ఆ సంగతి వాళ్ళ చూపుల్లోంచి బైటపడేందుకు దోబూచులాడుతోంది.

కోత పూర్తయింది.

భాగాలేసే కార్యక్రమం ప్రారంభమైంది.

"ఎరికెలోల్లగ్గూడా నాలుగు కుప్పలెయ్యండ్రా పాపం" ఎవరో కేకేశారు.

తలెత్తాడు ఎరుకల పెద్ద.

"మా రాజులు, మా నాయనోల్లు, యీల్లను నమ్ముకోకుండా ఎవురి మాటలో యిని సెడిపొయ్యినా, బెదిరిస్తే భయపడి దండిగా లెక్కిస్తారనే, నీ ఎనక నేనుంటాననే, యిప్పుడేమో పందుల్ను కోసక తినమని సెప్పె. ఆయన మాటయిని నాశనమైతి. రైతుల్నే నమ్ముకోనుంటే నా పొట్టగొడ్తరా?" అన్నాడు శోకం మధ్య గద్గదంగా.

ఆ మాటలు కొందరికి విన్పించాయి.
విన్పించిన వాళ్ళల్లో కొందరికి అర్థం కాలేదు.
అర్థమైన బాలయ్య తాతలాంటి వాళ్ళు ఆలోచనలో పడ్డారు.
మాంసం కుప్పల పంపకం మొదలైంది.
ఒక నిర్ణయానికి వచ్చిన వాడిలా లేచి జేబులు తడువుకొంటూ అక్కడికి వెళ్ళాడు బాలయ్య తాత.
కుప్పల పంపకాన్ని ఆపమని చెప్పాడు.
వాళ్ళతో వీళ్ళతో చర్చించాడు.
ఒక అవగాహనకు వచ్చిం తర్వాత ఎరుకల పెద్దను పిల్చి గొడ్లకొట్టం కంతవద్ద నిల్చోబెట్టారు.
తనో మాంసం కుప్ప అందుకొంటూ పద్దైదు రూపాయలు ఎరుకలతని చేతిలో పెట్టాడు బాలయ్య తాత.
రెండు కుప్పల మాంసాన్ని ప్రెసిడెంటు ఇంటికి తీసుకెళ్ళాడు చాకలి మద్దెన్న.
అతను వెళ్ళేసరికి కొడుకుతో తెగ ముచ్చట్లాడుతున్నాడు ప్రెసిడెంటు.
"సమస్యను మనమే పుట్టించాల. వాల్లందులో యిరుక్కొని వూపిరాడక గిలగిల్లాడుతూ మనదిక్కు చూసి చేతులు చాపినప్పుడు మనం శ్రీకృష్ణుడిలా పోయి చక్రం అడ్డేయాల. దాంతో వాల్లు మన కాల్లకాడనే పడుంటరు. ఇదే రాజకీయమంటే. ఇలాంటి పట్టువిడుపుల్లేకుంటే వీల్లంతా మనగాట నిలబడతారా?" హితోపదేశం చేస్తున్నాడు కొడుకుకు.
తండ్రి మేధావితనానికి రఘు అబ్బురపడుతున్నాడు.
"రెడ్డా! ఓరెడ్డా!" మద్దెన్న పిల్చాడు.
"యియ్యాగో సియ్యల్దెచ్చినా".
"ఇంట్లో యీపోరా!"
ఇంట్లో యిచ్చి బైటికొచ్చి చేతులు నులుముకొంటూ ప్రెసిడెంటు ముందు నిల్చున్నాడు మద్దెన్న.
"ఏం రా?"
"లెక్కబ్బా!"
"ఏం లెక్కరా?"
"సియ్యల్లెక్కే, కుప్ప పద్దైదొంతున ఏసిన్రు."
"లెక్క ఎవురికిరా?" ఆశ్చర్యంగా ఉంది అతనికి.
"ఎరికెలోల్లకే"
దిగ్భ్రాంతికి గురయ్యాడు ప్రెసిడెంటు.
"ఉద్దరగా కోసకతినమని సెప్పిన్నే నేను! లెక్కమాట మాట్లాడలేదే!" అన్నాడు నొసలు ముడేస్తూ.
"యేమోనబ్బా! ఎరికెలోల్లు ఏడుస్చాంటే ఎవురికీ సూడబుద్దిగాలే. బాలయ్య తాత ముందు లెక్కిచ్చిండు. బీదోల్ల కడుపుగొట్టి మనం బాగుపడమన్నెడు. వాల్ల కన్నీల్లతో

మనం కడుపు నింపుకొంటే మన గతీ అంతే నన్నెడు. అందరికీ అట్టనే అనిపిచ్చింది. ఎవురూ వూరికే తీసపోలే" చెప్పాడు.

సాలోచనగా ఒక దీర్ఘ నిశ్వాసాన్ని వదిలాడు ప్రెసిడెంటు. తన మనోభావాల్ని బైటపడనీకుండా జేబులోంచి లెక్కదీసి మద్దెన్నకిచ్చి పంపాడు.

తనేసిన పథకానికి పురిట్లోనే సంధి కొట్టటం ఆయనకు అరిగి రాకుండా ఉంది.

తన మాట కాదని వూరంతా ఒక నిర్ణయానికి రావటం ఆయన భరించలేక పోతున్నాడు.

సంవత్సరకాలం నుంచీ యువకుల్లో రేగిన అసంతృప్తి కన్నా ఇది ప్రమాదకరమైందిగా తోచింది ఆయనకు.

ఎరుకల మీద సాధించిన విజయానికి చిహ్నంగా మాంసాన్ని ఉచితంగా తినటంలో లభించే తృప్తికన్నా, ఎరుకలకు డబ్బులిచ్చి తాము ఓటమిని అంగీకరించటంలోనే రైతులు ఎక్కువ తృప్తిని పొందటం ఎందువల్లో ప్రెసిడెంటుకు అర్థం కాకుండా ఉంది.

అది ఓటమో, వాళ్లు సాధించిన విజయమో బహుశా అతనికి ఇప్పుడిప్పుడే అవగాహనకు రాదు.

ప్రెసిడెంటు చేతిలో మోసపోయిన ఎరుకలు తమకు ప్రతిబింబాలుగా అన్పించటం వల్లనే రైతుల్లో కొత్తమార్పుకు పునాది పడిందనే విషయం మరికొంత కాలానికిగాని ఆయనకు తెలిసిరాదు.

◆ *సాహిత్య నేత్రం 9వ సంచిక* - ***1998*** ◆